క్లుప్తంగా

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

అయిజ: స్వేరోస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బ్రైట్ స్టార్ పాఠశాలలో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు శనివారం ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరువుతున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరై అర్హత కలిగిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని గంజిపేటకు చెందిన పరశురాముడు, శిరీష లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సేవలను గుర్తించి శనివారం రంగారెడ్డి జిల్లాలో చందానగర్‌లో హెచ్‌పీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరుశరాముడు, ఉపాధ్యక్షురాలు శిరీషలకు ఉత్తమ సేవారత్న అవార్డును అందజేశారు. ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

ప్రభుత్వాలకు బుద్ధి చెబుతాం

గద్వాల అర్బన్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేటికి వరకు చేయడం లేదని, రాబోయే ఎన్నికల్లో ఎస్సీలు ఓట్ల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై ఈనెల 12న సాయంత్రం 4గంటలకు మహబూబ్‌నగర్‌లోని జెడ్పీ గ్రౌండ్ సమీపంలో రాయల్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సమావేశానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కన్నా, పరశురాముడు, రంజిత్, నందు, నవీన్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

'టీబీ'ని నిర్లక్ష్యం చేయకండి

రాజోళి: టీబీని నిర్లక్ష్యం చేయకూడదని సూపర్ వైజర్ జయప్రకాష్ తెలిపారు. శనివారం మండలంలోని అశోక్‌నగర్ క్యాంపులో టీబీపై ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలుగా దగ్గు, ఆయాసం, జ్వరం అనారోగ్య సమస్యతో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రారంభంలోనే వ్యాధిని గుర్తించి వైద్యం అందిస్తే నయం చేయవచ్చన్నారు.

సీఎం స్పందించాలని పూజలు



గట్టు: జిల్లాకు వచ్చే సీఎం కేసీఆర్‌కు అందజేసేందుకు సిద్ధం చేసిన వినతిపత్రానికి చిన్నోనిపల్లె నిర్వాసితులు శనివారం జములమ్మ ఆలయంలో పూజలను నిర్వహించారు. ఇంజినీరింగ్ అధికారుల తప్పిదం కారణంగా జిల్లాలో ఆయకట్టు లేకుండానే చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను నిర్మించినట్లు నిర్వాసిత రైతులు తెలిపారు. రిజర్వాయర్‌ను రద్దు చేసే విధంగా, సీఎం కేసీఆర్ మనస్సును మార్చాలని అమ్మవారిని వేడుకున్నట్లు రైతులు తెలిపారు.

అవినీతి పాలనను అంతం చేద్దాం

అయిజ: బీఆర్ఎస్ హయాంలో అవినీతి రాజ్యమేలుతుందని, ఈ పాలనను అంతం చేయాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని రాజాపురంలో శనివారం రాత్రి ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ మోసపూరితమైన హామీలిచ్చి అధికారాన్ని చేజిక్కించుకుందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల సంక్షేమాన్ని తుంగలో తొక్కారని ఆరోపించారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని మోసం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తే అన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెడతామన్నారు.

బహుజన నాయకత్వాన్ని నిలబెట్టుకుందాం

ధరూరు: నడిగడ్డ ప్రాంతంలో బహుజన నాయకత్వాన్ని నిలబెట్టుకుందామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గోవిందు అన్నారు. శనివారం జిల్లా చైర్మన్ గొంగ్ల రంజిత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని సమితి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద వర్గాల తరపున ప్రశ్నించే రంజిత్ కుమార్ ఎదుగులను, ప్రజాధారణ చూసి ఓర్వలేక అనేక రకాల కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

'హరితహారం' లక్ష్యం గాలికి

- కాగితాల్లోనే నాటిన మొక్కల వివరాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- కిందపడి పాడైపోతున్న ట్రీగార్డులు



గద్వాల-నది అగ్రహారం రోడ్డులో మొక్కల పరిస్థితి

గద్వాల అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన హరితహారం పథకం మండలంలో అబాసుపాలవుతుంది. రూ.లక్షలు వెచ్చించి నాటిన మొక్కలు పట్టించునే వారు లేక ఎండిపోతున్నాయి. ఏటా మొక్కలు నాటడం, వాటితో ఫోటోలు దిగి, కొటేషన్లు ఇచ్చి తర్వాత అటువైపు చూడకపోవడం అధికారులకు, ప్రజాప్రతినిధులకు సర్వసాధారణంగా మారింది. ఉన్నతాధికారులు ఎన్ని సార్లు హెచ్చరికలు జారీ చేసినా కింది స్థాయి సిబ్బందిలో మాత్రం మార్పు రావడం లేదు. మొక్కలు నాటినప్పుడు చూపిస్తున్న శ్రద్ధ వాటి సంరక్షణలో మాత్రం చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కాగితాల్లోనే మొక్కల పెంపకం..

మండలంలోని గద్వాల, గోన్‌పాడు, ముల్కలపల్లి, చెనుగోనిపల్లి, వీరాపురం, అనంతపురం, శెట్టి ఆత్మకూర్, బసల్‌చెర్వు, బీరెల్లి, గుంటిపల్లి, గుర్రంగడ్డ, జిల్లెడబండ, లత్తీపురం, కొండపల్లి, పరుమాల, సంగాల, వీరాపురం పరిధిలో నాటిన మొక్కలపై పట్టింపు కరువైంది. ప్రధాన రహదారుల వెంట నాటిన మొక్కలను తూతూ మంత్రంగా పట్టించుకుని గ్రామాల్లో నాటిన మొక్కలను అయితే అసలే పట్టించుకోవట్లేదు. దీంతో మొక్కలు ఎండిపోవడంతో పాటు ట్రీగార్డులు పూర్తిగా నేలమట్టమవుతున్నాయి. గద్వాల మున్సిపాలిటీలోని ప్రధాన రహదారుల వెంట నాటిన మొక్కలపై మాత్రమే దృష్టి సారిస్తున్న మున్సిపల్ అధికారులు పలుచోట్ల ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్, నాటిన మొక్కలపై మాత్రం దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయా వార్డుల్లో, గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణ ప్రజాప్రతినిధులు సైతం దృష్టి సారించాల్సి ఉన్నా అసలు పట్టించుకోవడం లేదు.

గద్వాల మండలంలో నాటిన మొక్కల వివరాలు

సంవత్సరం	నాటిన మొక్కలు
2018-19	1,38,144
2019-20	1,42,182
2020-21	1,52,716
2021-22	96,541

హరితహారం సమయంలో హడావుడి

హరితహారం కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిన సమయంలోనే అధికారులు హడావుడి చేస్తారు. ప్రజలకు పచ్చని వాతావరణంతో పాటు ఆహ్లాదాన్ని అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీరుగారుతుంది. నాటిన ప్రతి మొక్కకు నీరు అందించేలా ప్రతి శుక్రవారం వాటరింగ్ డే నిర్వహించాల్సిన అధికారులు తూతూమంత్రంగా కార్యాలయంలోనో, లేదంటే ప్రధాన రహదారుల వెంట ఉన్న మొక్కలకో నీటిని అందించి మమ అనిపించేస్తున్నారు. గద్వాల మున్సిపాలిటీ పరిధిలో 1.60లక్షల మొక్కలు నాటారు. మున్సిపల్ అధికారుల చెబుతున్న వాటికి, వాస్తవిక పరిస్థితులకు భిన్నంగా ఉన్నాయి.

90శాతం మొక్కలు బతికే ఉన్నాయి..

మున్సిపల్ పరిధిలో వార్డుల్లో, ప్రధాన రహదారుల్లో నాటిన మొక్కల్లో 90శాతం మొక్కలు బతికే ఉన్నాయి. మూడు ట్యాంకర్లతో మొక్కలకు నీరందిస్తున్నాం. ప్రధాన రహదారుల్లో ఉన్న మొక్కలకు నీరందిస్తామనేది అవాస్తవం. కాలనీల్లో సైతం మొక్కల సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం. 9 మంది కేర్ టేకర్స్ నియమించి ట్రీ పార్కుల్లో డ్రిప్ పద్ధతిలో నీరందిస్తున్నాం.

– నర్సింహ, మున్సిపల్ కమిషనర్, గద్వాల

రీప్లేస్ చేస్తున్నాం...

ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి రీప్లేస్ చేస్తున్నాం. ప్రధాన రహదారి పుటాన్‌పల్లి నుంచి వీరాపురం వరకు రాక్ ప్రాంతం. దీంతో మొక్కలు బతకడం లేదు. వాటిని రీప్లేస్ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. వాటరింగ్ చేపట్టి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. లింకు రోడ్లుకు మొక్కలు ఉన్నాయి. గ్రామాల్లో మొక్కలకు ఏర్పాటు చేసిన ట్రీ గార్డులను కొందరు ప్రజలు తీసుకెళ్లడంతో మేకలు, పశువులు తింటున్నాయి.

– చెన్నయ్య, ఎంపీడీఓ, గద్వాల మండలం

స్వరాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి



అలంపూర్‌లో రాష్ట్ర స్థాయి క్రీడాకారులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

అలంపూర్: రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మున్సిపాలిటీలు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా తెలంగాణ సుపరిపాలన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో రాణించిన ఫుట్‌బాల్ క్రీడాకారులను మున్సిపల్ చైర్‌పర్సన్ శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. అలంపూర్ పంచాయతీని సీఎం కేసీఆర్ మున్సిపాలిటీగా మార్చి అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. మున్సిపాలిటీగా మారిన తర్వాత సీసీ రోడ్లు, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లాలు, ఎల్ఈడీ వీధి దీపాలు, క్రీడా ప్రాంగణాలు, క్రిమిటోరియం, శ్మశాన వాటికలో షెడ్‌లు, స్వచ్ఛ ఆటోలు, వైకుంఠ వాహనాలు వంటివి వచ్చాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మేఘనాథ్, జూనియర్ అసిస్టెంట్ అహ్మద్ షరీఫ్, వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యులు నాగలక్ష్మమ్మ, అల్లబకాష, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, సకినాబి, సరోజమ్మ, సుదర్శన్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది రామచంద్ర, రామంజనేయులు, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

సుపరిపాలనతో కొత్త మండలం మరింత అభివృద్ధి

రాజోళి: కొత్త మండలంలో సాగిన సుపరిపాలనతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందాయని వైస్ ఎంపీపీ రేణుక అన్నారు. మండలాల ఏర్పాటుతో గ్రామాల్లో కొత్త శకం మొదలైందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిసాక్, ఎంపీడీఓ గోవిందురావు, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభకు తరలిరండి



కుచినెర్లలో పోస్టర్లు విడుదల చేస్తున్న గట్టు తిమ్మప్ప, నాయకులు

కేటీదొడ్డి: రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప పేర్కొన్నారు. మండలంలోని కుచినెర్ల, ఇతర గ్రామాల్లో శనివారం ఇంటింటికీ తిరుగుతూ బహిరంగ సభ పోస్టర్లను అందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కలెక్టర్, ఎస్పీ, పార్టీ కార్యాలయాలు ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 12 సాయంత్రం నిర్వహించే సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడ్, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, ఉరుకుందు, హనుమంతు, వెంకటేష్‌నాయుడు, నాసీర్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు: సీఎం సభను జయప్రదం చేయాలని గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడు కోరారు. శనివారం చాగదోణలో సీఎం సభ పోస్టర్లను బీఆర్ఎస్, గౌడ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనాలు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మునిచందర్‌గౌడ్, రాజుగౌడ్, బోయ సరోజమ్మ, శాంతమ్మ, శ్యామలమ్మ, హరిచంద్రగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

శాంతినగర్: జిల్లా కేంద్రంలో నిర్వహించే సీఎం బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేద్దామని పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో శనివారం సాయంత్రం విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసిన ఆయన మాట్లాడారు. అయిజ రోడ్డులో ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడేందుకు భారీ బహిరంగ సభ ఏర్పాటుచేశారన్నారు.

టోల్‌ప్లాజాలో సాంకేతిక సమస్య



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజాలో శనివారం సాంకేతిక సమస్య నెలకొంది. నెట్‌వర్క్ పని చేయకపోవడంతో టోల్‌ప్లాజాలో నిర్వహణలో అంతరాయం ఏర్పడింది. నిర్వాహకులు తాత్కాలికంగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే నెట్‌వర్క్ నిదానంగా ఉండడంతో వాహనరాకపోకలు టోల్‌గుండా వెళ్లడానికి నెమ్మదించాయి. ఉదయం దాదాపు 11 గంటల నుంచి పెద్ద సంఖ్యలో హైదరాబాద్, బెంగుళూరు వైపు నుంచి రాకపోకలు సాగించాల్సిన వాహనాలు టోల్‌ప్లాజా గుండా వెళ్లడానికి చాలా సమయం పట్టింది. దీంతో టోల్‌కు ఇరు వైపుల వాహనాలు బారులు తీరాయి. వాహనాలు సంఖ్య అధికంగా ఉండటంతో కొంత సేపు ట్రాఫిక్ సమస్య ఎదుర్కోవాల్సి వచ్చింది. ఫాస్టాగ్ వచ్చిన తర్వాత టోల్ ప్లాజా దాటడానికి వాహనదారులకు పెద్దగా సమయం పటేది కాదు. పండుగ సమయాల్లో వాహనాలు అధికంగా ఉన్నప్పటికీ ఐదు నిమిషాలలోనే టోల్ దాటేవారు. సాంకేతిక సమస్య నెలకొనడంతో టోల్ దాటడానికి వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది.

ఉద్యమకారులను ఆదుకోవాలి



అలంపూర్: రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో 2000 సంవత్సరం నుంచి రాష్ట్ర ఆవిర్భావం వరకు పోరాడిన ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. ఉద్యమకారులను ఆదుకోవడానికి ప్రభుత్వానికి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. 12వ తేదీన సీఎం కేసీఆర్ జిల్లాకు రానుండడంతో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అబ్రహంలకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

భక్తుల ప్రత్యేక పూజలు



మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్‌అండ్‌బీ సెక్షన్ కార్యాలయం ప్రారంభం



గట్టు: మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ సెక్షన్ కార్యాలయాన్ని శనివారం జేఈ రాజేశ్వరి ప్రారంభించారు. కార్యాలయాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సంత బజారులోని బాలికల పాఠశాల పక్కనే ఉన్న భవనాన్ని ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఏర్పాటుకు పంచాయతీ వారు కేటాయించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, కృష్ణమూర్తి, దేవన్న, శ్రీనివాసులు, గోపాల్ పాల్గొన్నారు.

కేటీదొడ్డిలో ఈదురుగాలుల వర్షం



కేటీదొడ్డి: మండలంలోని ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో కొండాపురంలో మామిడి చెట్లు, కరెంట్ స్తంభాలు విరిగిపడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మామిడి కాయాలు నేలరాలాయి. చివరి దశలో ఉన్న మామిడి నేలపాలు కావడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం



అలంపూర్ కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కవిత

అలంపూర్ రూరల్: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి కవిత అన్నారు. పట్టణంలోని కోర్టులో శనివారం లోక్‌అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వ్యక్తుల మధ్య వివాదాలు ఏర్పడినప్పుడు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు రాజీకావడం వల్ల అపరాధ రుసుము రూ.4,72,400 కోర్టుకు వచ్చాయని లోక్ అదాలత్ ఇన్‌చార్జ్ సాయితేజ తెలిపారు. కార్యక్రమంలో పీపీ కార్తీక్, ఏజీపీ నర్సింహులు, న్యాయవాదులు శ్రీధర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి



రోడ్డుపై ధర్నా చేస్తున్న సంపత్‌కుమార్, కార్యకర్తలు

అయిజ: ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో అయిజ-పులికల్ రోడ్డు నిర్మాణం పూర్తికావడం లేదని, దీంతో ప్రమాదాలకు గురై నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆరోపించారు. శనివారం పట్టణ సమీపంలో పులికల్ రోడ్డుపై కాంగ్రెస్ నాయకులు, కార్యర్తలతో కలిసి రోడ్డుపై ధర్నా చేపట్టారు. పులికల్ రోడ్డు ప్రమాదాలకు అడ్డాగా మారిందని అన్నారు. ప్రమాదాలతో ఇంకా ఎంత మంది మరణిస్తే రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తారని ప్రశ్నించారు. నాగలదిన్నె బ్రిడ్జిని కలిపే అంతర్రాష్ట్ర రహదారి అయిజ-పులికల్ రోడ్డు నిర్మాణానికి 2018లో నిధులు మంజూరైన ఇంతవరకు రోడ్డు పూర్తిచేయలేదని విమర్శించారు. రోడ్డు వెంట అనేక గ్రామాలు ఉండడంతో నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు పెద్ద ఎత్తున చేస్తుంటారన్నారు. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సంపత్‌కుమార్‌ను కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రోడ్డుపై ప్రజల నిరసన..

అయిజ-పులికల్ రోడ్డు పూర్తి కాకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు శనివారం రోడ్డుపై నిరసన తెలిపారు. బీజేపీ నాయకులు వారికి మద్దతు పలికారు. శిథిలమైన రోడ్డును పునర్ నిర్మించకపోవడంతో ప్రతిరోజు రోడ్డుపై ప్రమాదాలు అవుతున్నాయన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న హలీమ్ పాషా

గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ ఎన్నికల్లో హామీలను నెరవేర్చాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్‌పాషా డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నడిగడ్డకు యూనివర్సిటీ మంజూరు చేయాలని, జూనియర్ కళాశాల, గట్టులో డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని, జిల్లా కేంద్రంలో మైనార్టీ రెసిడెన్సియల్ బాలుర పాఠశాలను, అయిజ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని, జిల్లాకు పరిశ్రమలను తీసుకొచ్చి యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ మేరకు బహిరంగ లేఖను విడుదల చేశారు. సమావేశంలో భీమేష్, శాంతికుమార్, అజయ్, అశోక్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో బడిబాట



తిమ్మాపురంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలలోని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, కార్యదర్శులంతా కలిసి ఆయా గ్రామాల్లో తిరిగారు. ఆయా గ్రామాల్లో బడి బయటి పిల్లల్ని గుర్తించి పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులతో కూడిన విద్య, ఆహారాన్ని అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సమగ్రాభివృద్ధికి ఉపయోగపడాలి

గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ పర్యటన రాజకీయ, వ్యక్తి విమర్శలకు కాకుండా, జిల్లా సమగ్రాభివృద్ధికి ఉపయోగపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గట్టు ఎత్తిపోతల పథకం పనులు వేగంగా పూర్తి చేయాలని, నెట్టెంపాడు ముంపు బాధితుల పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని విడుదల చేయాలని, ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు సాగు నీరందించాలని, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని, అక్షరాస్యతలో వెనుకబడిన జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలని, పీజీ కళాశాలలో కొత్తగా కోర్సులు ప్రవేశపెట్టాలని, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న సీఎం కేసీఆర్ పర్యటన జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే వేదిక కావాలన్నారు. సమావేశంలో మద్దిలేటి, దేవదాస్, పరంజ్యోతి, నర్సింహ తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్‌చౌరస్తా సమీపంలో ఈ నెల 6న జాతీయ రహదారిపై ఆటోను, మరో వాహనం ఢీకొనడంతో నలుగురికి గాయాలైన సంఘటన విధితమే. ఈ మేరకు శనివారం హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా వెల్దుర్తి మండలం బొమ్మరెడ్డిపల్లెకు చెందిన భార్యాభర్తలు రాజశేఖర్, లక్ష్మితో పాటు శ్రుతి, సుధీర్, అజయ్‌కుమార్ ఆటోలో వెళ్తున్న క్రమంలో మరో వాహనం ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. డ్రైవర్ పరారీలో ఉండడంతో శనివారం రాజశేఖర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాల్‌రాజు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కార్యకర్తల సమావేశానికి తరలిరండి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: మహా జనసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 9ఏళ్ల నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి గురించి వివరించడానికి ఈనెల 13వ తేదీ ఉదయం శాంతినగర్‌లో అలంపూర్ నియోజకవర్గ సీనియర్ కార్యర్తల సమావేశం, మధ్యాహ్నం కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో నియోజకవర్గ సంయుక్త మోర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 14వ తేదీ ఉదయం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గద్వాల నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఉంటుందని, మధ్యాహ్నం నియోజకవర్గ సంయుక్త మోర్చా కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అధికారులకు పురస్కారాలు



ఎంపీడీఓకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల అర్బన్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ ఉత్తమ సేవలు అందించినందుకు గద్వాల ఎంపీడీఓ చెన్నయ్యకు జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రశంసాపత్రాన్ని అందించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్‌రావు, ఈఈ రహీముద్దీన్, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌లకు ఉత్తమ పురస్కారాలను అందజేశారు.